# పొదుపు

రామలక్ష్మి గబగబా నడుస్తోంది. ఇంకా నడవాలి....నడవాలి. ఇంత కష్టపడి బస్‌స్టాప్‌దాకా నడిచినా ఇలా చూస్తుంటే అలా వెళ్ళి పోతుంది బస్సు. రామలక్ష్మికి దూరంగా ఆగివున్న ఆటో కనిపించింది ఇవాల్టికి ఆటోలో వెళ్ళిపోతేసరి. ఈ ఆటోవాళ్ళు ఏమిటోగాని మీటరుపైన డబ్బులడుగుతారు. మీటరు వుండగా పైన డబ్బులెందుకియ్యాలో ఎంత ఆలోచించినా అర్థంకాదు రామలక్ష్మికి.

చకచకా నడిచిన రామలక్ష్మికి గుర్తొచ్చింది తన హాండ్‌బాగ్‌లో వున్న చిన్న సంచీ విషయం. అది మడతలు విప్పినకొద్దీ పెద్ద సంచీ అవుతుంది. బొంబాయినించి అన్నయ్య తెచ్చియిచ్చాడు తనకి. రామలక్ష్మి బాగ్‌లోవున్న చిన్న సంచీ బయటకి తీసింది. రంగురంగుల పూల క్రేప్ సిల్కు సంచీ అది. దానినిండా కూరలు కొనుక్కుని ఇంటికి వెళ్ళాలి ఇప్పుడు.

ఈమధ్య పిల్లలు కూరలు కొనుక్కు రావటం మానేశారు. "నువ్వు బేరాలాడుతున్నావు. మేము రాము నీతో" అంటారు పైగా. "పాపం, మనకి అమ్మిన కిలో కూరకి పది పైసలు లాభం వుండద్దా" అంటూ ఆ కూరలమ్మేవాళ్ళ పక్షాన తనతో పెద్దగా వాదనకి దిగుతారు. ఈ గొడవ

లన్నీ ఎందుకని? ఆఫీసునించి ఇంటికెడుతూ తనే కూరలు కొనుక్కోవటం మొదలుపెట్టింది. రామలక్ష్మి చేతిలోవున్న చిన్నసంచీ కూరలతో నిండి పోయింది. అక్కడో పదిపైసలు, ఇక్కడో దారణా బేరమాడి మొత్తానికి ఎనభై పైసలదాకా పొదుపు చేసింది. అవును మరి ఎనభై పైసలు మాత్రం తక్కువా? చేతిలో సంచీ బరువుగావుంది. ఈ చేతిలోంచి ఆ చేతికి మార్చుకుంది సంచీని రామలక్ష్మి.

నాలుగు అడుగులు వేసిందోలేదో కాలు ముందుకు పడకుండా ఆగింది. ఏమైంది? అయ్యో!! ఇప్పుడే జరగాలా యిది? చెప్పు తెగి పోయింది!!

ఒక చేతిలో సంచీ, భుజాన హేండ్‌బాగ్, మరో చేతిలో తెగిన చెప్పు, తెగని చెప్పు!! ఎవరైనా చూస్తారేమో? ఎవరు చూస్తే తనకేం? ఎవరి చెప్పు తెగినా చేత్తో పట్టుకోవాల్సిందేగా!!

నడుస్తున్న రామలక్ష్మి ముఖానికి చెమట పట్టింది. దూరంగా పాన్ దుకాణం పక్కన కూచున్నాడు చెప్పులు కుట్టే అబ్బాయి....నడవా ల్సిందే. ఏం చేస్తాం? మొఖాన పట్టిన చెమట తుడుచుకుంది రామలక్ష్మి.

కూరల సంచీ పక్కన పెట్టి, దానిపైన హేండ్‌బాగ్ పెట్టి, తెగిన చెప్పు ముందు పడేసింది.

చిన్నమేకు తీసాడు చెప్పులు కుట్టే అబ్బాయి.

"దారం వేసికుట్టు, గట్టిగా వుంటుంది." రెండో చెప్పు వంక చూస్తూ అంది రామలక్ష్మి.

దారంతో కుట్టిన చెప్పు ముందు పడేశాడు తలెత్తి అయినా చూడకుండా.

"ఇదిగో" ఇరవై పైసల బిళ్ళ తీస్తూ అంది. "అరనా" తల ఎత్త కుండా పని చేసుకుంటూ అన్నాడు.

"ఏమిటీ అరణానా? ఇంత దారం వేసి కుట్టినందుకు. రామలక్ష్మి ఆ మాట అంటూనే ఇరవై పైసల బిళ్ళ విసిరింది. తాళ్ళ మధ్య, తోళ్ళ

మధ్య తంగున పడింది అది. రామలక్ష్మి చకచకా వెళ్ళిపోతుంటే, "నీయమ్మ" ఇరవై పైసల బిళ్ళతీసి పక్కన పెట్టుకున్నాడు చెప్పు కుట్టిన అబ్బాయి.

టైము ఆరు కావస్తోంది. రామలక్ష్మికి ఓపిక పూర్తిగా పోయింది. అయితే, మొత్తానికి కూరల దగ్గర బేరమాడి ఎనభై పైసలు, చెప్పు కుట్టించుకుని ముప్పై పైసలు. అంటే రూపాయి పది పైసలు అదా చేసింది తను. తను కనక ఇంత పొదుపుగా సంసారం చేస్తోంది. అయినా పొదుపుగా సంసారం చేసుకోకపోతే ఎలా? రామలక్ష్మి చాలా తృప్తిగా కూరల సంచీ వంక, కాలి చెప్పులవంక ఒక్కసారి చూసుకుంది. చుట్టాలని, స్నేహితులని డబ్బు సరదాగా, విచ్చలవిడిగా ఖర్చు చేయకుండా పొదుపుగా వుండటం ఆడవాళ్ళకే వస్తుంది మరి!!

రామలక్ష్మి రిక్షా బేరమాడి రెండు రూపాయలనుంచి రూపాయి బారణాకి కుదుర్చుకుంది.

రామలక్ష్మి ఇంట్లో అడుగుపెడుతుంటే పరిగెత్తుకువచ్చి, కూరల సంచీ అందుకుంది బుజ్జి. రామలక్ష్మి చిన్నకూతురు.

"మమ్మీ! లలితట, నీకోసం వచ్చింది."

"లలితా" రామలక్ష్మి గుర్తు తెచ్చుకుంటోంది.

"ఏం చెప్పిందీ?" అలసటగా కుర్చీలో కూలబడింది రామలక్ష్మి.

"అమెరికాలో వుంటుందిట. వచ్చి నెలరోజులయిందిట. రేపు వెళ్ళిపోతోందిట!" కూరల సంచీలోంచి రెండు ఎర్రని టమాటాలు తీసుకుంది బుజ్జి.

అమెరికా లలితా? ఎవరబ్బా? ఆ.... అవును. అమెరికా లలిత. రామలక్ష్మికి గుర్తొచ్చింది లలిత.

ఏడాది దాటింది తన స్నేహితురాలు ఇందిర పెళ్ళయి. ఆ పెళ్ళిలో కలిసింది లలిత. అవును, లలిత ఇందిర ఆడబిడ్డ. చాలా సరదాగా

కబుర్లు చెప్పింది. ఈమాటు త్వరలో ఇండియా వస్తాను. తప్పకుండా మీ యింటికి వస్తాను అంది. ఎంత మంచిదో! మాట మరిచిపోకుండా తనని గుర్తుపెట్టుకు వచ్చిందన్న మాట! రామలక్ష్మి బడలిక తీరిపోయింది.

"బుజ్జీ! ఇంకా ఏం చెప్పిందే? ఎంతసేపట్లో వస్తానందీ?" రామలక్ష్మికి చాలా ఆనందంగాను, ఉత్సాహంగానూ వుంది.

లలిత ఎంత మంచిదో! తనని చూడ్డానికి వస్తోంది. హోంవర్కు చేసుకుంటున్న బుజ్జి "ఏమో, నాకేం తెలియదు" అంది విసుగ్గా.

రామలక్ష్మి హడావిడిగా ఇల్లంతా ఒక్కసారి సర్దింది. డ్రాయింగ్ రూములో ఫ్లవర్‌నాట్‌పై వున్న దుమ్ము దులిపి పెట్టింది. సోఫాలపై కవర్లు మార్చింది.

"బుజ్జీ! ముఖం కడుక్కుని ఆ బర్త్‌డే ఫ్రాకు వేసుకో" లోపల నుంచి కేక పెట్టింది.

"అబ్బ! బోర్ మమ్మీ! నేను హోంవర్కు చేసుకోవాలి" విసుగ్గా అంది బుజ్జి.

"నేను చెప్పినట్టు చేయి" ఉరిమింది రామలక్ష్మి.

"ఒరేయ్ రాజూ! ఇటురా" బేగ్ తెరిచింది. "మంచి స్వీటు, హాటు పట్టుకురా! తొందరగా. ఆవిడ వచ్చేస్తుందీ" లోపల దాచిన గాజుకప్పులు, ప్లేట్లూ తీస్తూ అరిచింది రామలక్ష్మి.

"ఒక్కావిడ వస్తుంటే ఇంత హడావిడి ఏమిటీ? ఇంట్లో వున్న బిస్కట్లు, టీ ఇస్తే చాలదా?" రాజు అద్దంలో చూసుకుని తలదువ్వుకుంటున్నాడు. పదోక్లాసు చదువుకుంటున్నాడు.

"ఏమో? లలిత. ఆవిడ భర్త, పిల్లలు. ఇంకా ఎవరెవరు వస్తారో త్వరగా వెళ్ళు."

రామలక్ష్మి అందమైన వెంకటగిరి జరీచీర కట్టుకుంది. చెవులకున్న దుద్దులు మార్చి పచ్చటి దుద్దులు పెట్టుకుంది. అద్దంలో చూసుకుంటుంటే, బెడ్‌రూములో పుస్తకం చదువుకుంటున్న రవి పకపకా నవ్వాడు.

"దేనికా నవ్వు?" మాచింగ్ గాజులు చేతులకి వేసుకుంటూ రవి వైపు చూసింది రామలక్ష్మి.

"ఏంలేదు. ఒకవేళ మీ స్నేహితురాలిగారి, ఆడబిడ్డగారు అదే! అమెరికా లలితగారు షాపింగ్ హడావిడిలో మీ యింటికి రావటం మరిచి పోతే ఏమిటీ అని" పుస్తకం ముఖానికి అడ్డం పెట్టుకుని మళ్ళీ పకపక నవ్వాడు రవి.

"పోన్లెండి కానీ .. తమరు ఆ షర్టు మారుస్తారా? కాస్త లేచి చక్కగా డ్రస్ చేసుకోండి. ప్లీజ్" అని చేతిలోవున్న పుస్తకాన్ని లాగి పారేసింది రామలక్ష్మి.

"నీ స్నేహితురాలికి, అదే అమెరికా స్నేహితురాలికి నన్ను పరిచయం చేయక్కర్లేదు....తెలిసిందా!"

"ఒకవేళ అతను వస్తే?"

"అప్పుడు చూద్దాంలే." కాళ్ళ దగ్గరున్న రగ్గు కప్పుకొని రామలక్ష్మివైపు చూస్తూన్నాడు. రామలక్ష్మి అద్దంలో మరోసారి చూసుకుంటుంటే.

వీధిలో కారు హారన్ మోగగానే రామలక్ష్మి ముఖం సంతోషంతో నిండిపోయింది.

"హాయ్" లోపలకొచ్చింది లలిత. అసలే తెల్లగా వుండే లలిత మరీ తెల్లగా అయింది. కళ్ళ రెప్పల పైన, బుగ్గల పైన రంగులు మెరుస్తున్నాయి.

"షాపింగ్‌కి వెడుతూ నిన్ను చూద్దామని ఇక్కడ ఆగాను. నువ్వు లేవు, సరే" లలిత వాచీ చూసుకుంది.

"మీ వారు...."

"ఆ ... కారులో ఉన్నారు" భుజాలపై పడుతున్న జుట్టు ఒకసారి సర్దుకుంది లలిత.

"లోపలికి రమ్మను" బుజ్జి తెచ్చిన ప్లేటు అందుకుని లలిత చేతిలో పెట్టింది రామలక్ష్మి.

"ఇలాంటి విజిట్స్ మావారికి నచ్చవు. ఎట్లాగూ ఇలా వెడుతున్నాం కదా అని కారు ఆపించా నేను. మరి వస్తాను" లలిత లిప్‌స్టిక్ పెదవులు చిన్న రుమాలుతో అద్దుకుంటూ అంది.

"కొంచంసేపు కూచో, ఇవి తిను."

"వెరైటీస్ ఆఫ్ ఐస్‌క్రీమ్సు తినటం అలవాటయ్యాక, ఇవేవీ నాకు తినాలనిపించదు. బలే ఉన్నాయే ఈ పచ్చల దుద్దులు, మా ఇందిరకి చెప్తాను – నాకు చేయించి పంపమని" చిన్న ముక్క తుంచి నోట్లో వేసుకుంది లలిత. కారు హారన్ అప్పటికే రెండుసార్లు మోగింది.

"సీ యూ, లేటర్, బై .... చేయి వూపి గబ గబా వెళ్ళి కార్లో కూచుంది లలిత.

కదిలిపోతున్న కారు వంక చూస్తూ నిలబడిపోయింది రామలక్ష్మి. చక్కగా అమర్చిన ఫ్లవర్ వాజ్, ప్లేట్లో వున్న స్వీట్లు రామలక్ష్మి వైపు చూసి నవ్వుతున్నట్లే అనిపించింది ఒక్క క్షణం. అంతలోనే చెప్పు కుట్టించుకుని, తను విసిరిన ఇరవై పైసల బిళ్ళ కింద పడ్డ శబ్దం చెవుల్లో ఒక్కసారి మార్మ్రోగింది. ఎటో చూస్తూ సోఫాలో కూర్చున్న రామలక్ష్మి భుజాన చేయి పడింది. ఉలిక్కిపడింది రామలక్ష్మి. రవి నవ్వుతూ పక్కన కూర్చున్నాడు.

"ఫరవాలేదులే, మనం తిందాం" ప్లేట్లో స్వీటు తను కొంచెం తిని, రామలక్ష్మి నోటి కందించాడు రవి.